సాక్షి కర్నూలు

శనివారం, 4, మార్చి, 2023



ఊబకాయం.. బహుభారం!

సమాజంలో ఊబకాయుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అతిగా తినడం.. కదలకుండా కూర్చోవడం.. వ్యాయామం లేకపోవడం ఇందుకు కారణమని తెలుస్తోంది. IIలో



0.7 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల డ్యాంలో శుక్రవారం సాయంత్రం సమయానికి 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 1,210 క్యూసెక్కుల ఉండగా కేసీకి 1,325 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

ఉష్ణోగ్రతలు

గరిష్టం	37.5
కనిష్టం	20.0

న్యూస్‌రీల్

ఉపాధి పనులకు పెరుగుతున్న డిమాండ్



వెల్దుర్తి మండలం లక్ష్మినగరంలో జరుగుతున్న ఉపాధి పనులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి పనులకు లేబర్ రిపోర్టింగ్ క్రమంగా పెరుగుతోంది. రోజు లక్ష మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యం కాగా.. ప్రస్తుతం 74వేలకు పైగా కూలీలు హాజరవుతున్నారు. ఈ నెల 2న 74048, 3న 72269 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి లేబర్ రిపోర్టింగ్‌ను లక్షకు పైగా పెంచాలనే లక్ష్యంతో ఉన్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. జిల్లాలో ఐదు క్లస్టర్లు ఉండగా పత్తికొండ క్లస్టర్‌లో ఉపాధి పనులకు కూలీల హాజరు ఎక్కువగా ఉంటోంది. శుక్రవారం పత్తికొండ క్లస్టర్‌లో 16,448, ఎమ్మిగనూరు క్లస్టర్‌లో 13,297, కర్నూలు క్లస్టర్‌లో 12844, ఆదోని క్లస్టర్‌లో 15631, ఆలూరు క్లస్టర్‌లో 14076 మంది ప్రకారం కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో ఉపాధి పనులకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది.

13 ఎంపీటీసీ స్థానాల్లో 33,374 మంది ఓటర్లు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖాళీగా ఉన్న 13 ఎంపీటీసీ స్థానాల్లో మొత్తం 33,374 మంది ఓటర్లు ఉన్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 2న ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఫొటో ఎలక్ట్రోల్ రోల్స్‌ను ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రచురించామన్నారు. ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాల పరిధిలో 40 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు ఈ స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా, పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. కాగా ఈ స్థానాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు 146 మంది అధికంగా ఉన్నారు.

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న పీడీ వెంకటనారాయణ

ఆలూరు: జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ తెలిపారు. దేవనకొండ మండలం తెర్నేకల్ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అందుబాటులో ఇసుక, సిమెంట్, ఇనుమును అందుబాటులో ఉంచామన్నారు. కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తయిన వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీల సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. ఉగాది నాటికి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తామని చెప్పారు. పీడీ వెంట గ్రామ సర్పంచ్ అరుణకుమార్, హౌసింగ్ ఈఈ గురుప్రసాద్, ఏఈ అనిరుధ్ బాబు ఉన్నారు.

స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి



స్ట్రీట్ వాక్ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లో స్ట్రీట్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టప్రకారం స్కానింగ్ మిషన్లు ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు, జన్యు సలహా కేంద్రాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో నిర్ణీత రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వీటిలో పనిచేసే సిబ్బంది పూర్తిస్థాయి ప్రమాణాలు కలిగి ఉండాలన్నారు. చట్టవిరుద్ధంగా గర్భస్రావం చేస్తే శిక్షార్హులవుతారన్నారు. ఆయన వెంట ఉలిందకొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కరరెడ్డి, డెమో శ్రీనివాసులు, లీగల్ కన్సల్టెంట్ సుమలత, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ ఉన్నారు.

ఉగాదికి ఇంటి పండుగ

- 13,773 గృహ ప్రవేశాలే లక్ష్యం
- ఇప్పటికే 9 వేల గృహ నిర్మాణాలు పూర్తి
- ఆర్‌ఎల్, రూఫ్‌కాస్ట్ దశలో మరో 4 వేల నిర్మాణాలు
- పొదుపు మహిళలకు రూ.83.23 కోట్ల ఆర్థిక చేయూత
- అందుబాటులో స్టీల్, సిమెంట్, ఇసుక
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

రాష్ట్ర ప్రభుత్వ ఆశయం నెరవేరుతోంది. నవరత్నాల పథకాల్లో భాగంగా పేదల సొంతింటి కల సాకారం అవుతోంది. ఉగాది పర్వదినం రోజున 'ఇంటి' పండుగకు అంతా సిద్ధమవుతోంది. ఒకే సారి వేలాది మంది గృహప్రవేశాలు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లక్ష్యం మేరకు జగనన్న కాలనీల్లో అన్ని వసతులతో సర్వాంగ సుందరంగా గృహాలు పూర్తి కావొచ్చాయి. పెద్ద పండుగ రోజున పేదల మోముల్లో సంతోషాలు వెల్లివిరియనున్నాయి.



ఉగాదిన గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న రాతనలోని సుజాత ఇల్లు



ఎమ్మిగనూరు మండలం బోడబండ లే అవుట్‌లో పూర్తికావొస్తున్న పేదల ఇళ్లు

కర్నూలు(అర్బన్): తెలుగు సంవత్సరాది 'ఉగాది' కి జిల్లాలో నూతన గృహ ప్రవేశాల సందండి నెలకొననుంది. పండుగ రోజున సొంత ఇంటిలో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో పప్పన్నం తినాలనే పేద, మధ్య తరగతి వర్గాల ఆశలు సాకారం కానున్నాయి. పండుగ రోజున 13,773 గృహ ప్రవేశాలు జరిపించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గృహ నిర్మాణాల వేగం ఊపందుకుంది. ఇప్పటికే 9 వేల గృహ నిర్మాణాలు పూర్తి కాగా, మరో 4 వేల గృహ నిర్మాణాలు పూర్తి అయ్యే దశలో ఉన్నాయి.

జిల్లాలోని 344 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాల వేగం పెరిగింది. జిల్లాకు మొత్తం 46,900 గృహాలు మంజూరు కాగా, ఉగాది పండుగ నాటికి 13,773 గృహ ప్రవేశాలు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఆయా కాలనీల్లోని గృహ నిర్మాణాల వేగం పెంచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ఇప్పటికే ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రూ.223 కోట్లు వెచ్చించి అంతర్గత రోడ్లు, విద్యుత్, నీటి వసతిని కల్పించారు. ముఖ్యంగా లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేసిన నాలుగైదు రోజులకే చెల్లిస్తున్నారు. అలాగే ఆయా లేవుట్లలో లబ్ధిదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఓటీఎస్ కింద రూ.18 లక్షలతో 36 పనులతో పాటు నాన్ ఓటీఎస్ కింద ఆదోని అర్బన్‌లో రూ.11 కోట్లతో అప్రోచ్ రోడ్ల పనులను ప్రారంభించారు.

పెరిగిన గృహ నిర్మాణాల వేగం

మూడో ఆప్షన్ కింద జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన గృహ నిర్మాణాల వేగం పెరిగింది. ఈ కంపెనీ ఆధ్వర్యంలో ఆదోని అర్బన్‌లో 5,200, ఎమ్మిగనూరు శివన్న నగర్‌లో 872, మంత్రాలయం పరిధిలోని మంచాల 1, 2 లేఅవుట్లలో 350 గృహ నిర్మాణాల పనులు ఊపందుకున్నాయి.

పొదుపు మహిళలకు రూ.83.23 కోట్ల ఆర్థిక చేయూత

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు గృహాలను నిర్మించుకునేందుకు వీలుగా మెప్మా, డీఆర్‌డీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు మొత్తం 23,781 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.35 వేల ప్రకారం రూ.83.23 కోట్లను రుణంగా అందించారు. గృహాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలకు తోడు ఈ మొత్తం కూడా వారికి అందడంతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు కూడా గృహ నిర్మాణాల్లో బిజీ అయ్యారు.

అందుబాటులో స్టీల్, సిమెంట్, ఇసుక

జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్‌కు ఇబ్బంది లేకుండా అవసరాల మేరకు సరఫరా చేస్తున్నారు. ఇప్పటి వరకు లబ్ధిదారులకు 2,332 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను ఇవ్వగా ఇంకా ఆయా గోడౌన్లలో 3,478 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. అలాగే 27,773 మెట్రిక్ టన్నుల సిమెంట్‌ను అందించగా, ఇంకా 6,211 మెట్రిక్ టన్నుల సిమెంట్ నిల్వలు గోడౌన్లలో ఉన్నాయి. ఇసుకకు సంబంధించి జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ప్యాలకుర్తి, కోసిగి, నందవరం, కర్నూలు సమీపంలోని టీవీ 9 కాలనీ, ఈర్లదిన్నె ప్రాంతాల్లో ప్రత్యేకంగా డిపోలను ఏర్పాటు చేశారు.

గృహ ప్రవేశాలకు అంతా సిద్ధం



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు 13,773 గృహ ప్రవేశాలను చేయించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం. ఇప్పటికే 9 వేల గృహ నిర్మాణాలు పూర్తి కాగా, పూర్తి అయ్యే దశలో మరో 4 వేలకు పైగా ఉన్నాయి. గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉంది. నిధుల సమస్య కూడా లేదు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు అంతా సిద్ధం చేశాం.

– కే వెంకటనారాయణ, పీడీ, హౌసింగ్

చాలా సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. త్వరితగతిన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాం. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారంతో పాటు మేం కూడబెట్టుకున్న కొంత నగదును వెచ్చించి సొంతంగా ఇల్లు నిర్మించుకున్నాం. ఇప్పటి వరకు రూ.1.50 లక్షల బిల్లు విడుదలైంది. ఉగాది పండుగ నాడు గృహ ప్రవేశం చేస్తాం. సొంతంగా ఇల్లు కట్టుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– సుజాత, రాతన, తుగ్గలి మండలం

జగనన్నకు రుణ పడి ఉంటాం



సొంత ఇల్లు లేని మాలాంటి ఎంతో మంది పేదోళ్లకు ఇంటి పట్టా ఇచ్చి ఇంటిని కట్టించి ఇచ్చిన జగనన్నకు రుణ పడి ఉంటాం. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో ఇంటిని పూర్తి చేసుకున్నాను. ఇప్పటి వరకు రూ.1.80 లక్షలు బ్యాంకు అకౌంట్‌లో బిల్లు పడింది. ఇద్దరు పిల్లలతో సొంత ఇంట్లోకి ఉగాది పండుగ రోజున చేరుతాం.

– ఫాతిమా, గోనెగండ్ల

గుడిసెలో ఉండే బాధ తప్పింది



భర్త, ముగ్గురు పిల్లలతో గుడిసెలోనే జీవనం చేస్తున్నాం. మాకున్న సొంత స్థలంలోనే ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో కొత్తగా ఇంటిని నిర్మించుకున్నాం. గుడిసెలో నుంచి సొంత ఇంటిలోకి వెళ్తుండడం చాలా సంతోషంగా ఉంది. ఉగాది నాడు గృహ ప్రవేశం చేసేందుకు నిర్ణయించుకున్నాం. పేదోళ్లకు అన్ని విధాలా సహాయం చేస్తున్న జగనన్న ప్రభుత్వం పదికాలాలు చల్లగా ఉండాలి.

–కొండగేని తాయమ్మ, కోసిగి

ఉల్లంఘనల నియంత్రణకు 'ట్రాఫిక్ మిత్ర'

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వినూత్న కార్యక్రమం
- పోలీసు సేవలో ప్రజల భాగస్వామ్యం
- 'ట్రాఫిక్ మిత్ర' పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ



'ట్రాఫిక్ మిత్ర' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, పోలీస్ అధికారులు

కర్నూలు: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం జిల్లా పోలీసు శాఖ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎక్కడైనా, ఎవరైనా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే నేరుగా ప్రజలే కర్నూలు పోలీస్ వెబ్‌సైట్ (http://kurnoolpolice.in/trafficmitra/)కు ఫొటో లేదా వీడియో తీసి చేరవేయవచ్చు. ఈ వెబ్‌సైట్‌ను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం రాజ్‌విహార్ సెంటర్‌లో లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా ప్రజలు, పౌరులను పోలీసుల సేవల్లో భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో పోలీసు శాఖ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు పౌరులు తమ సెల్ ఫోన్ల ద్వారా పంపించిన ఫొటోలు, వీడియోలను ట్రాఫిక్ విభాగం పోలీసులు విచారణ, నిర్ధారణ చేసి చలానా విధిస్తారు. ట్రాఫిక్ ఉల్లంఘనులపై ఫొటోలు, వీడియోలు బాగా అప్‌లోడ్ చేసిన వారి వివరాలను గుర్తించి ముగ్గురికి బహుమతులు కూడా ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ ప్రకటించారు.

పౌరుల భాగస్వామ్యానికి ఆహ్వానం...

కర్నూలు నగరంలో సుమారు 5.50 లక్షల జనాభా ఉంది. రోజురోజుకూ కాలనీలు విస్తరిస్తున్నాయి. వాహనాల సంఖ్య పెరుగుతోంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రధాన రహదారుల్లో సుమారు 36 పాయింట్లు ఉన్నాయి. ట్రాఫిక్ స్టేషన్‌లో ప్రస్తుతం 70 మంది మాత్రమే సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ఏ విధంగా సేవలు అందించాలనే ఆలోచనలు, సలహాలను కూడా పోలీస్ వెబ్‌సైట్‌లో తెలియజేస్తే ఆ విధంగా పని చేసేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు.

పోలీస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సిన వివరాలు...

త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపటం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం, సీటు బెల్టు లేకుండా కారు నడపటం వంటి ఉల్లంఘనలపై పోలీస్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి 'ట్రాఫిక్ మిత్ర' కాలమ్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ట్రాఫిక్ ఉల్లంఘించిన ప్రాంతం, వాహనం నంబర్, వాహనం చిత్రాలు/వీడియో తీసి వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ట్రాఫిక్ ఉల్లంఘనులపై ఫొటోలు, వీడియోల రూపంలో అత్యధికంగా సేవలు అందించే ముగ్గురికి బహుమతులు ఇవ్వనున్నట్లు ఎస్పీ ప్రకటించారు. లాంఛనంగా ప్రారంభం జరిగిన కొద్దిసేపటికే వెబ్‌సైట్‌కు 532 ఉల్లంఘన ఫిర్యాదులు రాగా, నిర్ధారించుకుని వారికి రూ.37,553 జరిమానా విధించినట్లు ఈ సందర్భంగా ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటాద్రి, నాగభూషణం, కె.వి.మహేష్, సీఐలు శ్రీనివాసులు, అబ్దుల్ గౌస్, రమణ, ఆర్‌ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూములకు రక్ష

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు



భూ రీసర్వేపై రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి. కోటేశ్వరరావు

ఎమ్మిగనూరురూరల్: రీ సర్వేతో భూ రికార్డులు పక్కాగా ఉంటాయని, భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం, సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల తర్వాత ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా డ్రోన్ల సహకారంతో భూ సర్వే చేస్తున్నారన్నారు. సర్వే పూర్తి చేసిన తరువాత ప్రతి రైతుకు 92 యాక్ట్ కింద నోటీసులు ఇచ్చి అభ్యంతరాలు కూడా స్వీకరిస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ జయన్న, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఉన్నారు.

ఈ–కేవైసీ 100 శాతం పూర్తి చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): రబీ పంటల నమోదు ప్రక్రియ 100 శాతం పూర్తి అయిందని, ఇదే తరహాలోనే ఈ–కేవైసీ కూడా చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరరావు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శనివారం రాత్రిలోపు రైతులందరితో ఈ–కేవైసీ చేయించాలని సూచించారు. ఈ–కేవైసీ చేయించడం వల్ల కలిగే ఉపయోగాలను రైతుల్లోకి తీసుకెళ్లాలన్నారు. రబీ పంటల నమోదుపై ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, ఉద్యానశాఖ ఏడీ రామాంజనేయులు, మత్స్యశాఖ డీడీ శ్యామలమ్మ, జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లపై పర్యవేక్షణ లోపిస్తే చర్యలు

- ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డి

కర్నూలు(అర్బన్): సాంఘిక వసతి గృహాలపై పర్యవేక్షణ లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తన చాంబర్‌లో సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హాస్టల్‌లో మూమెంట్ రిజిష్టర్ తప్పక నిర్వహించాలన్నారు. హైకోర్టు పరిధిలోని న్యాయ సేవాధికార సంస్థకు చెందిన న్యాయమూర్తులు త్వరలో వసతి గృహాలను తనిఖీ చేయనున్నారన్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వసతి గృహాల్లో ఉండే పదో తరగతి విద్యార్థుల్లో ఒక్కరు ఫెయిల్ అయినా హెచ్‌డబ్ల్యూఓపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆదోని సహాయ సంక్షేమాధికారులు బీ మద్దిలేటి, ఎస్ లీలావతి, కే బాబు, సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వేషం మార్చి.. నవ్వులు పూయించి!

- హొళగుందలో ప్రారంభమైన కామన్న వేడుకలు





స్త్రీవేషధారణలో కుంభాలను తీసుకెళ్తున్న యువకులు, బలిదాన ప్రదర్శన ఇస్తున్న దృశ్యం

హొళగుంద: సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెబుతూ హొళగుంద మండల కేంద్రానికి చెందిన యువకులు శుక్రవారం కామన్న వేడుకలు నిర్వహించారు. మహిళల వేషధారణతో హావభావాలను పలికించారు. బలిదాన ప్రదర్శన నిర్వహించి కడుపుబ్బా నవ్వించారు. హోలీ పున్నమిని పురస్కరించుకుని హొళగుందలో ప్రతి ఏటా కామన్న వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా స్థానికంగా ఉన్న విరక్త మఠం పరిసర ప్రాంతాల యువకులు ఉత్సవాల్లో తమదైన పాత్రను పోషించేందుకు సన్నద్ధమయ్యారు. శుక్రవారం స్త్రీ వేషధారణతో అమ్మవారికి కుంభాలను తీసుకెళ్లారు. పురవీధుల్లో విచిత్ర వేషాలతో ఊరేగింపు నిర్వహించి బలిదాన సన్నివేశాలను రక్తికట్టించారు. వేడుకల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు కూతురి కాన్పు కష్టాలు, వరుడి అన్వేషణ, కామన్న భార్యల కష్టాలు, కామన్న దహనం ఇలా పలు హాస్య సన్నివేశాలను ప్రదర్శించనున్నారు. ముగింపు రోజున కామన్న దహనంతోపాటు మజ్జిగ బండ్లు, ఏనుగు, ఒంటెల ఊరేగింపు ఉంటుంది. వేడుకల్లో చివరి రోజు హోలీ పండుగను ఘనంగా జరుపుకుంటామని యువకులు తెలిపారు.



మోహినీ అలంకరణలో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు

సమ్మోహనం.. జగన్మోహిని రూపం

- దిగువ అహోబిలంలో మోహినీ అలంకారంలో ప్రహ్లాదవరదుడు దర్శనం
- ఎగువ అహోబిలంలో పొన్నచెట్టు వాహనంపై విహరించిన స్వామి

ఆళ్లగడ్డ: అమృతం అసురులపాలు కాకుండా లోక సంరక్షణ కోసం మహావిష్ణువు జగన్మోహిని అవతారం ధరించగా అహోబిల నరసింహుడు అదే రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం జగన్మోహినీ అలంకరణలో ఉన్న స్వామిని అహోబిల గ్రామంలో గడపగడపకు తీసుకెళ్లారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువుంచి నవ కలశస్థాపన గావించారు. అనంతరం శ్రీ ప్రహ్లాదవరదుడిని నూతన పట్టుపీతాంబరాలతో మోహినీ అలంకరణలో ముస్తాబు చేసి పూల పల్లకీలో కొలువుంచారు. భక్తుల గోవింద నామస్మరణ, మంగళవాయిద్యాల మధ్య స్వామిని ఊరేగించారు. రాత్రి శరభ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఎగువ అహోబిలంలో జ్వాల నరసింహస్వామి పొన్నచెట్టు వాహనంపై భక్తులను అనుగ్రహించారు. పల్లకీలో కొలువుంచి స్వామికి గ్రామోత్సవం చేశారు.

అహోబిలంలో నేడు..

ఎగువ అహోబిలంలో శనివారం ఉదయం అభిషేకం, సాయంత్రం గజవాహన సేవ, రాత్రి తిరుక్కల్యాణోత్సవం ఉంటుంది. దిగువ అహోబిలంలో పొన్నచెట్టు వాహనంపై ప్రహ్లాదవరదడు విహరిస్తారు.

క్లుప్తంగా

5, 6తేదీల్లో డాక్టర్ ఖాదర్‌వలీ పర్యటన

- సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అంశంపై అవగాహన సదస్సులు

కర్నూలు(అగ్రికల్చర్): సిరి ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై జిల్లా ప్రజలకు పద్మశ్రీ అవార్డు గ్రహీత, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఖాదర్‌వలీ అవగాహన కల్పించనున్నారు. ఈయన జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించి సిరి ధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరిస్తారు. 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాదర్‌వలీ ఉమ్మడి జిల్లా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నెల 5వ తేదీ ఉదయం పత్తికొండ, సాయంత్రం ఆదోనిలో.. 6వ తేదీ ఉదయం బనగానపల్లి, సాయంత్రం కర్నూలులో నిర్వహించే అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొంటారు.

శ్రీ మఠంలో ప్రముఖులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఏపీడీ శ్రీధర్‌రావు శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరితో పాటు ఎమ్మిగనూరు జడ్జి గురుఅరవింద్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, ఏపీఎం జయశ్రీ తదితరులు ఉన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి


మృతి చెందిన అలియా సాధియా (ఫైల్)

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక విశ్వనగర్ వీధిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సలీమ్‌నగర్ వీధికి చెందిన అలియా సాధియా (20)కు విశ్వనగర్‌కు చెందిన షాకిర్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. అయితే భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధించేవారు. ఈ క్రమంలో అలియాసాధియా ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. అయితే భర్త కుటుంబీకులే తమ కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలి తండ్రి అన్సారి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 3712	రూ. 7521
పొద్దుతిరుగుడు	రూ. 3488	రూ. 5009
ఆముదం	రూ. 4869	రూ. 6319
వాము	రూ. 5090	రూ. 19012
ఉల్లి	రూ. 418	రూ. 820
ఎండు మిర్చి	రూ. 4599	రూ. 39399
శనగలు	రూ. 3010	రూ. 4575
కందులు	రూ. 3500	రూ. 8110
మొక్కజొన్న	రూ. 2059	రూ. 2093
మినుములు	రూ. 6679	రూ. 6896


అబ్బో.. చాలా దాహమేస్తుంది


హమ్మయ్యా.. ఇక్కడ నీళ్లున్నాయి


ఎవరైనా వస్తారేమో.. ఓ కన్నేద్దాం


జలప్రసాదం.. నీటి బిందువును గుటకేస్తూ..

నీటి బిందువులు.. పిట్ట సెలయేళ్లు!

గతవారం వరకు వణుకు పుట్టించిన చలి శివరాత్రి నాటితో శివశివామని వెళ్లిపోగా.. ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉక్కపోతతో జనం అల్లాడిపోతుండగా.. మూగప్రాణులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. పల్లెల్లో కాస్త పర్వాలేదనిపించినా.. పట్టణాల్లో గొంతు తడుపుకునేందుకు పిట్టల అవస్థలు వర్ణనాతీతం. నగరంలోని గణేష్‌నగర్‌లో శుక్రవారం ఓ ఇంటి ఆవరణలోని మొక్కలపై నిలిచిన నీటి బిందువులతో దాహం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్న దృశ్యాలు వేసవి 'కన్నీటి' పాట్లకు అద్దం పట్టాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయాన్నే తమ అరుపులతో నిద్రలేపే ఈ చిన్న ప్రాణులు.. పల్లెలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ బుజ్జి పొట్టలు నిండటం గగనమవుతోంది. ఇక పట్టణాల్లో ఎక్కడో కానీ కనిపించని ఈ పిట్టల ప్రాణాలు కాపాడేందుకు కనీసం ఎండా కాలంలోనైనా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇళ్ల వద్ద చిన్న పాత్రల్లో నీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఈ ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి


చికిత్స పొందుతూ మృతి చెందిన హరి


మృతిచెందిన బాలమద్ది

ఆదోని అర్బన్: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన ఆదోని పట్టణ సమీపంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన హరి(24), వీరేంద్ర, రాజశేఖర్ ముగ్గురు ఒకే బైకుపై ఆరేకల్‌లో జరుగుతున్న ఉరుసుకు వెళ్తున్నారు. ఆస్పరి మండలం చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బాలమద్ది(28) ఆరేకల్‌లో ఉరుసు చూసుకుని బైకుపై వస్తున్నాడు. ఆదోని పట్టణ సమీపంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బాలమద్ది అక్కడికక్కడే మృతిచెందాడు. హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన హరి, వీరేంద్రకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వీరిని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక హరి మృతిచెందాడు. హరికి గతేడాది ఆగస్టులో వివాహమయ్యింది. చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బాలమద్దికి భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఊబకాయం.. బహుభారం!

- పెరుగుతున్న స్థూలకాయుల సంఖ్య
- ఐదేళ్ల క్రితం జనాభాలో 12 శాతం మంది ఊబకాయులు
- ప్రస్తుతం 15 శాతానికి పెరిగిన బాధితులు
- శారీరక శ్రమ లేకపోవడం, అతిగా తినడమే కారణం
- నేడు అంతర్జాతీయ ఊబకాయ దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఊబకాయుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అతిగా తినడం.. గంటల తరబడి ఒకేచోట కదలకుండా కూర్చోవడం.. వ్యాయామం లేకపోవడం ఇందుకు కారణాలుగా తెలుస్తోంది. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మార్చి 4వ తేదీన అంతర్జాతీయ ఊబకాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత అంచనాల ప్రకారం 48లక్షల మంది ప్రజలు ఉన్నారు. ఐదేళ్ల క్రితం జానాభాలో 6 లక్షల మంది (12శాతం) ఊబకాయంతో బాధపడేవారని అంచనా. ప్రస్తుతం ఈ సంఖ్య 15 శాతానికి చేరుకుంది. అంటే జిల్లాలో 9 లక్షల మంది స్థూలకాయం సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. ఇందులో మూడు లక్షల మంది స్త్రీలు, ఒక లక్ష మంది పిల్లలు ఉండవచ్చని వారు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లోని స్త్రీలలోనే ఊబకాయుల సంఖ్య వేగంగా పెరుగుతోంది.

జీవనశైలి మారడంతోనే సమస్య

మారుతున్న జీవనశైలిలో భాగంగా సరైన ఆహార నియమాలు పాటించడం లేదు. జంక్‌ఫుడ్‌తో శరీరంలో అవసరానికి మించి కొవ్వు చేరి ఊబకాయం వస్తోంది. మోతాదుకు మించి ఆహారం తీసుకోవడం, సరైన వ్యాయామం లేకపోవడం, ధూమపాన వ్యసనం, మానసిక ఒత్తిళ్లు, కొన్నిసార్లు వారసత్వం వల్ల కూడా దీనిబారిన పడవచ్చు. ఊబకాయంతో గుండెకు సంబంధించిన వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, గ్యాస్ట్రబుల్, జీర్ణకోశవ్యాధులు, నిద్రలో సరిగా ఊపిరి తీసుకోలేకపోవడం(గురక), కీళ్లకు సంబంధించిన వ్యాధులు, కొన్ని రకాలైన క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది. శరీరంలో అధిక కొవ్వు పెరగడం అంతిమంగా హృదయంపై ప్రభావం చూపుతుంది. ఉదయం, సాయంత్రం వేళ కచ్చితంగా కొంత సమయం వ్యాయామం చేయడం ఉత్తమం. చెమట పట్టేలా నడవడం, పరిగెత్తడం ద్వారా కొవ్వు కరిగించవచ్చు.

పట్టణాల్లోనే ఎక్కువ

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లోనే ఊబకాయుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో శారీరక శ్రమ చేసే వారు అధికం. వ్యవసాయ పనులతోపాటు యంత్రాల అవసరం లేకుండా ఇంటి పనులు సొంతంగా చేసుకోవడం కారణంగా అక్కడ ఊబకాయుల సంఖ్య తక్కువగా ఉంటోంది. దీనికి విరుద్ధంగా పట్టణాల్లో పరిస్థితులు ఉన్నాయి. ఎక్కువ శాతం కూర్చుని చేసే ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో ఉండడం, వ్యాయామం లేకపోవడం వల్ల ఊబకాయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ఊబకాయం లెక్క ఇదీ...

బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ) ఆధారంగా అంటే వయస్సు, ఎత్తు, బరువు ఆధారంగా ప్రతి మనిషి ఎంత బరువు ఉండాలనేది నిర్దేశిస్తారు. నిర్దేశిత బీఎంఐ 24.9 ఉంటే సాధారణ బరువు ఉన్నట్లు, 25 నుంచి 29లోపు ఉంటే అధిక బరువు, 29కి పైగా ఉంటే ఊబకాయం సమస్యతో బాధపడుతున్నట్లు నిర్ణయిస్తారు.



ఈ పదార్థాలకు దూరంగా ఉండాలి

సాచ్యురేటెడ్ కొవ్వులు, ఉప్పు, పంచదార పాళ్లు మోతాదుకు మించి ఉండే చిరుతిళ్లు తినడం ప్రమాదకరం. బర్గర్, పిజ్జా, ఫ్రెంచి ఫ్రైస్, కేకులు, నూడిల్స్, చిప్స్, తీపి ఉండలు, పంచదార పెట్టిన సీరల్స్, ఫాస్ట్‌ఫుడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్, రెడిమేడ్ కూల్ డ్రింక్స్ లాంటివి జంక్‌ఫుడ్ గానే చెప్పవచ్చు. మసాలా చాట్, పకోడిలు, బజ్జీలు, టమోటా కెచప్, వెన్నతో కూడిన కేకులు, చాక్లెట్ డింగ్–డాంగ్స్ లాంటివి కూడా ఎక్కువ తీసుకోకూడదు.

మోతాదుకు మించి తినొద్దు



పిల్లలు టీవీ ముందు కూర్చుని చిరుతిళ్లు ఎక్కువగా తింటుంటారు. ఈ పద్ధతిని మాన్పించాలి. పెద్దలు వ్యాయామం చేయాలి. శారీరక శ్రమ కచ్చితంగా ఉండాలి. 2030 నాటికి దేశంలో 2.7కోట్ల మంది పిల్లల్లో ఊబకాయం వచ్చే అవకాశం ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. మంచి ఆరోగ్యం కోసం ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఫైబర్ ఉన్న పదార్థాలు తినాలి. మాంసాహారం, ధూమపానం, మద్యపానం అలవాట్లు మానాలి.

-డాక్టర్ నవీన్‌కుమార్, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, కర్నూలు

స్థూలకాయుల సంఖ్య పెరిగింది



సమాజంలో స్థూలకాయుల సంఖ్య బాగా పెరిగింది. కరోనా తర్వాత బయటి ఆహారం అధికంగా తీసుకుంటున్నారు. పండ్లు తినడం తగ్గించడం చేశారు. చిన్నవయస్సులోనే గుండెసమస్యలు, కీళ్లనొప్పులు వస్తున్నాయి. మహిళల్లో పీసీవోడీ సమస్యలు పెరిగాయి. ఇటీవల కొందరు జిమ్‌కు వెళ్లి హైప్రొటీన్ డైట్ డ్రింక్స్ తాగుతున్నారు. ఇలా ఒకేసారి ఎక్కువ ప్రొటీన్ తీసుకోవడం మంచిది కాదు. ఆహారంలో కార్బొహైడ్రేట్స్‌తో పాటు ప్రొటీన్స్, మిల్లెట్స్ లాంటి అన్ని రకాల పోషకాలు ఉండాలి.

– ఎ. రవీంద్ర, డైటీషియన్, కర్నూలు

మత్తుకు బానిసై..

- ఇంటి ఆవరణలో గంజాయి మొక్కల పెంపకం
- వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

దొర్నిపాడు: మద్యం, మత్తుకు బానిసైన ఓ వ్యక్తి ఏకంగా ఇంటి ఆవరణలోనే గంజాయి మొక్కలు పెంచుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. భాగ్యనగరం గ్రామానికి చెందిన గద్ద మూగెన్న అనే వ్యక్తి మద్యం, గంజాయి తాగే అలవాటు ఉంది. దీంతో సాధువుల గంజాయి తెచ్చుకొని వాటిలో విత్తనాలను ఇంటి ఆవరణలో నాటాడు. వాటిని పెంచి తనకు వినియోగించడంతో పాటు ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకోవచ్చని అనుకున్నాడు.

కాగా విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం మూగెన్న ఇంటి ఆవరణలోని నాలుగు గంజాయి మొక్కలు (4.96 కిలోలు)లతో పాటు 128 గ్రాముల గంజాయి పొడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 30 వినతులు


తన సమస్యను విన్నవిస్తున్న కానిస్టేబుల్

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 30 మంది పోలీసు సిబ్బంది హాజరై వినతులను సమర్పించారు. సిబ్బంది సమస్యలు విన్న ఎస్పీ తగిన పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఆయా సమస్యలను పరిశీలించాల్సిందిగా జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన విభాగం అధికారులకు సూచించారు. డీపీఓ ఏఓ సురేష్ బాబు, ఎస్‌బీ సీఐ ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరువు హత్యకు ప్రేమే కారణం

- మిస్టరీ వీడిన ఆలమూరు ప్రసన్న హత్య కేసు
- ప్రియుడి కోసం భర్తను వదిలేసిన కుమార్తె
- నచ్చజెప్పినా వినకపోవడంతో దారుణంగా చంపిన తండ్రి
- ముగ్గురు నిందితుల అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు
- కారు, బైక్, కొడవలి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి

పాణ్యం: జిల్లాలో సంచలనం సృష్టించిన ఆలమూరు ప్రసన్న హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. పరువు హత్యకు ప్రేమే కారణమని పోలీసుల విచారణలో తేలింది. హత్యకు పాల్పడిన నిందితుల్లో ముగ్గురు పోలీసులకు పట్టుబడ్డారు. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి శుక్రవారం పాణ్యం సర్కిల్ కార్యాలయంలో హత్య కేసు నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. ఆలమూరుకు చెందిన సిద్దిరెడ్డి దేవేంద్రారెడ్డి కుమార్తె ప్రసన్నకు బనగానపల్లె మండలం జిల్లెల గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డితో వివాహమైంది. అప్పటికే ఆలమూరు గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఆమెకు ప్రేమ వ్యవహారం ఉండేది. దీంతో తరచూ ఆమె భర్తతో విభేదించి పుట్టింటికి చేరుకునేది. ఈ విషయంపై ప్రసన్నకు పలుమార్లు కుటుంబీకులు, బంధువులు చెప్పినా ప్రవర్తన మార్చుకోలేదు. తండ్రి దేవేంద్రారెడ్డి నచ్చజెప్పినా మార్పు రాకపోవడంతో ఈనెల 10వ తేదీన ప్రసన్న గొంతు నులిమి చంపేశాడు. అనంతరం మృతదేహాన్ని మాయం చేసేందుకు దేవేంద్రారెడ్డి ఐదుగురు బంధువుల సహాయం తీసుకున్నారు. అదే రోజు రాత్రి మృతదేహాన్ని కారులో ప్రకాశం జిల్లా గిద్దలూరు – గాజులపల్లి సమీపంలోని నల్లమల ఘాట్ వద్దకు తరలించారు. అక్కడ మృతదేహం తల, మొండెం వేరు చేసి లోయలో పడేశారు.

తాత ఫిర్యాదుతో వెలుగులోకి..

మనువరాలి ప్రసన్న ఆచూకీ లేకపోవడంతో తాత (దేవేంద్రారెడ్డి మేన మామ) శివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృతంగా దర్యాప్తు చేపట్టారు. లోయలో గాలించి ప్రసన్న తల, మొండెంను గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రసన్న హత్యకు ప్రేమే కారణమని పోలీసుల విచారణలో తేలింది. హత్యకు పాల్పడిన ప్రసన్న తండ్రి సిద్దిరెడ్డి దేవేంద్రారెడ్డి, అతని బంధువులు గురువుగాళ్ల పెద్ద వెంకటన్న, సిద్దిరెడ్డి బుగ్గరామేశ్వరరెడ్డి కొణిదేడు గ్రామ వీఆర్‌ఓ మహేష్ వద్ద నేరం ఒప్పుకోవడంతో సీఐ వద్ద హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. మరో ముగ్గురు నిందితులు మల్లు జయచంద్రారెడ్డి, మల్లు గోపాల్‌రెడ్డి, సిద్దిరెడ్డి ఉపేంద్రారెడ్డి పరారీలో ఉన్నారని, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి త్వరలో పట్టుకుంటామన్నారు. హత్యకు ఉపయోగించిన కారు, బైక్, కొడవలిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనతి కాలంలోనే హత్య కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. మిగిలిన వారి కోసం ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అరటి తోట దగ్ధం


ప్రమాదంలో దెబ్బతిన్న అరటి తోట

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ పరిసర ప్రాంతంలో అరటి తోట దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలు.. హుసేనాపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు.. 3 ఎకరాల దేవుని మాన్యం కౌలుకు తీసుకుని అరటి తోటను సాగు చేస్తూ జీవనం చేస్తున్నాడు. ప్రస్తుతం తోట కాపు దశకు వచ్చింది. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు నిప్పంటించడంతో కాలిబూడిదైంది. ఎకరాకు రూ.2 లక్షల చొప్పున దాదాపు రూ.6 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

మామిడికి 'తేనెమంచు' బెడద

- ఉష్ణోగ్రతల్లో అధిక వ్యత్యాసంతో తీవ్రమవుతున్న పురుగులు
- సింథటిక్ పైరిత్రాయిడ్స్‌ను ఒకసారికి మించి పిచికారీ చేయవద్దు
- రైతులకు ఉద్యాన సాంకేతిక అధికారి మహబూబ్‌బాషా సూచనలు


మామిడి రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యాన సాంకేతిక అధికారి మహబూబ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో అధిక వ్యత్యాసం ఉండటంతో మామిడిలో తేనెమంచు పురుగుల తీవ్రత ఎక్కువగా ఉందని సాంకేతిక ఉద్యాన అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. ఓర్వకల్లు మండలంలోని వివిధ గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించామని, తేనెమంచు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించినట్లు చెప్పారు. ప్రస్తుతం మామిడి పిందె, కాయ దశల్లో ఉందని, తేనె మంచుపురుగులను అదుపు చేసుకోకపోతే పంట దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం థైయోమిథాక్సమ్ 0.3 గ్రాములు, ఆ తర్వాత బుప్రొఫెజిన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి ఒకదాని తర్వాత ఒకటి పిచికారీ చేసుకోవాలన్నారు. సింథటిక్ పైరిత్రాయిడ్స్ అయిన థైయోమిథామిక్స్+లాంబ్డా, అసిఫేట్+ఇమిడాక్లోప్రిడ్ లాంటివి ఒకసారి కంటే ఎక్కువ పిచికారీ చేయరాదని చెప్పారు. వీటిని ఒక్కసారి కంటే ఎక్కువసార్లు పిచికారీ చేస్తే పురుగు తీవ్రత మరింత పెరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డైనోటెఫ్యురాన్ 20 ఎస్‌జీ–0.2 గ్రాములు లేదా పైమెట్రోజైన్ 50 డబ్ల్యూజీ 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పురుగు/ దోమ మందుల నివారణకు వేప నూనె 3000 పీపీఎం 3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మామిడిలో పండు ఈగ ఆశించే దశ మొదలైందని, ఎర బుట్టలు భూమి నుంచి 6–7 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

మందులు తక్కువ ధరకు విక్రయించాలి



మందుల గురించి ఆరా తీస్తున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): జీవనధార మందుల దుకాణంలో మందులను ఎంఆర్‌పీ కంటే తక్కువ ధరకు రోగులకు విక్రయించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని జీవనధార మందుల దుకాణాలతో పాటు చిన్నపిల్లలు, గైనిక్ విభాగాలను తనిఖీ చేశారు. జీవనధార మెడికల్ షాపులో మందుల ధరలను,వాటి ఎక్స్‌పైరీ తేదీలను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన మందులను విక్రయించాలని ఆదేశించారు. పలు విభాగాల్లో శానిటేషన్ సూపర్‌వైజర్లు, శానిటేషన్ సిబ్బందిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఆసుపత్రిని, విభాగాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. క్యాజువాలిటీకి వచ్చే మెడికో లీగల్ కేసులు, నాన్ మెడికో లీగల్ కేసుల గురించి ఆరా తీశారు. రోగులకు అత్యవసర చికిత్సను అందించి, వీలైనంత త్వరగా వార్డులకు మార్చాలన్నారు. ఆయన వెంట ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

8న బ్రాహ్మణ మహిళలకు సన్మానం



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్

కర్నూలు కల్చరల్: బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి, గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న బ్రాహ్మణ మహిళలకు ఈనెల 8న సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గాయత్రీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం దేవీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకు ని ఉన్నతంగా రాణిస్తున్న మహిళలను గౌరవించుకోవాలని నిర్ణయించామన్నారు. దీంతో పాటు బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి మహిళా విభాగం కార్యవర్గాన్ని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు నరేష్, కార్యదర్శి శ్యామసుందర్, కోశాధికారి రాజశేఖర్, సభ్యులు శ్రీనివాసరాజు, నాగరాజు శర్మ, రాధాకృష్ణ, ప్రసాదరావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా విజయభాస్కర్



కర్నూలు (న్యూటౌన్): ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.విజయ భాస్కర్ కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ చాలా కాలంగా రెగ్యులర్ ఎంఈఓ లేరు. ప్రస్తుతం గోనెగండ్ల ఎంఈఓ వినోద్‌కుమార్ ఇన్‌చార్జ్ బాధ్యతలు చూసేవారు. ఆయన స్థానంలో విద్యాశాఖ అధికారులు ఎం.విజయభాస్కర్‌ను నియమించారు. పలువురు హెచ్‌ఎంలు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌పై కేసు నమోదు

గడివేముల: నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్‌పై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బీటీ వెంకట సుబ్బయ్య తెలిపిన వివరాలు.. గత ఏడాది జూన్ 19న చిందుకూరు గ్రామానికి చెందిన కుంచేపు పార్వతమ్మకు, కండక్టర్ వెంకటేశ్వర్లుకు బస్సు నిలిపే విషయంలో వాగ్వాదం జరిగింది. కండక్టర్ తనను కాళ్లతో తన్ని, చేతులతో కొట్టి, నానాభూతులు తిట్టాడని బాధితురాలు కుంచేపు పార్వతమ్మ కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు కండక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్,బలగం , సార్, వినరో భాగ్యము విష్ణు కథ,ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్, గ్యాంగ్ లీడర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, సార్, బలగం, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, బలగం , వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా,గ్రంథాలయం, క్రీడ్ -3
భరత్ కాంప్లెక్స్ : బిగ్ స్నేక్ కింగ్
రాజ్ : గ్యాంగ్ లీడర్
శ్రీరామ : బిగ్ స్నేక్ కింగ్ , గ్రంథాలయం
విజయ : వినరో భాగ్యము విష్ణు కథ

ఆహ్లాదం.. ఆరోగ్యం

- మొక్కల పెంపకంపై ఆసక్తి చూపుతున్న నగరవాసులు
- కాలుష్య నివారణతోపాటు ఇంటికి అందం
- నర్సరీల్లో రూ.10 నుంచి రూ.2 వేల వరకు లభ్యం



నర్సరీల్లో ఉన్న వివిధ రకాల మొక్కలు







కర్నూలు(సెంట్రల్): పచ్చని మొక్కలు ఇంటి అందాన్ని పెంచుతాయి. ఆ ఇంట్లో ఉన్నవారికి ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచుతాయి. ఎన్నో కాలుష్య కారకాల నియంత్రణకు మొక్కలే ఔషధాలు. అంతేందుకు మనం శ్వాస పీల్చుకునే ఆక్సిజన్ కూడా వాటి నుంచే లభిస్తుంది. మనం వదిలే కార్బన్‌డైయాక్సైడ్‌ను స్వీకరిస్తాయి. ఈ నేపథ్యంలో కర్నూలు నగరంలోని ప్రజలు తమ ఇల్లు, ఇంటి పక్కన ప్రదేశాల్లో మొక్కల పెంపకంపై ఆసక్తిని కనబరుస్తున్నారు.

నగరంలో ఐదు నర్సరీలు...

మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో పరిశ్రమలు, రోడ్లు, ఇండ్లు, కాంప్లెక్సులు, ఇతర వినియోగాల కోసం ఉన్న చెట్లను నరికి వేస్తున్నారు. దీంతో రోజురోజుకు నగరాలు, పట్టణాలు కాలుష్యమయంగా మారుతున్నాయి. ఫలితంగా ప్రజలు ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ఇండోర్ కాలుష్యంతో ఎక్కువగా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ఇళ్లలోని కరెంట్ వస్తువులు, ఫ్రిజ్, కూలర్లు, ఏసీలు తదితరులు పలు కారకాలను విడుదల చూస్తూ ఇండోర్ కాలుష్యానికి కారణం అవుతున్నాయి. దీని నివారణకు కేవలం మొక్కల పెంపకమే మార్గం. ప్రస్తుతం నగరంలో ఐదు నర్సరీలు ఉన్నాయి. సీక్యాంప్, గుత్తి పెట్రోల్ బంక్, పాత బస్టాండ్, బిర్లాగేట్, బళ్లారి రోడ్డులో ఉన్న నర్సరీల్లో దాదాపు 3,600 మొక్కలు లభిస్తున్నాయి. ఇందులో పండ్లు, పూలు, ఔషధం, ఆయుర్వేదం, ఇతర రకాల మొక్కలు ఉన్నాయి. వీటి ఖరీదు మొక్కను బట్టి రూ.10 నుంచి రెండు వేల వరకు పలుకుతున్నాయి. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన పెరగడంతో తమ ఇళ్లలోనే కుండీల్లో మొక్కలను పెంచుతున్నారు. కొందరు మహిళలు మొక్కల పెంపకాన్ని హాబీగా చేసుకొని పర్యావరణానికి తమవంతు సాయం అందిస్తున్నారు.

మొక్కల పెంపకం హాబీ



మొక్కల పెంపకంతో పర్యావరణానికి ఎంతో మేలు. మా ఇంట్లో కుండీల్లో పలు రకాల మొక్కలు పెంచుతున్నాను. ఇందులో రెండు రకాల పూల మొక్కలు ఉన్నాయి. అవి ఇంట్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నారు. ప్రతిరోజూ వాటిని సంరక్షించుకోవడం నా విధి. మొక్కల పెంపకం నా హాబీ.

–అరుంధతి, బుధవార పేట, కర్నూలు

ఆహ్లాదకరమైన వాతావరణం



మా ఇంట్లో మొక్కల పెంపకంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మేము అద్దె ఇంట్లో ఉంటున్నా ఇంట్లోనే కొంత ప్రదేశంలో మొక్కలు పెంచుతున్నాం. మార్కెట్‌లో రకరకాల మొక్కలు లభిస్తున్నాయి. ఎండాకాలంలో ఇంట్లో మొక్కల పెంపకం వల్ల చల్లని గాలి వస్తుంది.

–జ్యోతి, మద్దూరు నగర్, కర్నూలు

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి



రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతోంది. మానవుడి అవసరాల కోసం ఉన్న చెట్లను కొట్టివేస్తున్నాడు. ఈ క్రమంలో పచ్చదనం కరువవుతోంది. దీంతో పట్టణాలు, నగరాల్లో వేడిమి అధికమవుతోంది. మొక్కల పెంపకంతో ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచి సంరక్షించాలి.

– బీవై మునిప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరు, కాలుష్య నియంత్రణ మండలి

రెండు రోజులు నీటి సరఫరా బంద్

కర్నూలు (టౌన్): ఈనెల 8, 9 తేదీలలో కర్నూలు నగరంలో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునగాలపాడు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్‌నగర్‌కు వెళ్లే ఫిల్టర్ బెడ్స్‌కు నీటి సరఫరా చేసే 1200 ఎం.ఎం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనివల్ల రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని ఆయన తెలిపారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణా శిబిరం

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో స్థానిక బీసీ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే ఉచిత ధ్యాన, యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జేఏసీ కన్వీనర్లు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య శుక్రవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. యోగా శిక్షకులు జి.వెంకటేష్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. శిక్షణలో పాల్గొనే వారు యోగా మ్యాట్ తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7330798474 ను సంప్రదించాలన్నారు.

6న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

కర్నూలు కల్చరల్: బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఈనెల 6న సాయంత్రం 5 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర శర్మ తెలిపారు. హిందూ బంధువులు, ఆధ్యాత్మిక భక్తులు వ్రతాల్లో పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

నగరపాలక బడ్జెట్ రూ.255.99 కోట్లు

- ఏకగ్రీవంగా ఆమోదించిన పాలకపక్ష సభ్యులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరపాలక సంస్థ 2023–24 వార్షిక బడ్జెట్ శుక్రవారం ఆమోదం పొందింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగరపాలక కమిషనర్ భార్గవతేజ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ సమావేశానికి ఆమోదం పొందారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ సమావేశ హాలులో నగర మేయర్ బీవై.రామయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య బడ్జెట్ సమావేశంలో పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు, అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ నగరంలో పనులు ఎందుకు జాప్యం జరుగుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. ఒక ఏరియాలో ఒక విధంగా పనులు జరుగుతుంటే ఏమి చేస్తున్నారన్నారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు ఎందుకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో వచ్చే సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లందరూ మేయర్ పోడియం వద్ద కూర్చొని ఆందోళన, నిరసనలు చేపడతారని హెచ్చరించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన విలువైన స్థలాలు కబ్జాకు గురవుతుంటే ఏమి చేస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నించారు. జొహరాపురం, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో ఖాళీ స్థలాలను ఆక్రమిస్తున్న విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఏమి చేశారని ప్రశ్నించారు. మేయర్ స్పందిస్తూ.. సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి, మున్సిపల్ ఎస్‌ఈ శేషసాయి, టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు కల్పించాలి

- కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్



మామిదాలపాడులో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 13న జరగనున్న రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్లలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్టాంటన్‌పురం, మామిదాలపాడులోని పోలింగ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేసి, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చే గ్రాడ్యుయేట్స్‌కు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని సూచించారు. ఆర్డీఓ వెంట కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు, మండల సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం

- విజయ డెయిరీ ఛైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి



ఛైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరించిన డెయిరీ అధికారులు, సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) సోలార్ విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టిందని డెయిరీ ఛైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యుత్‌ను ఆదా చేయడం, డెయిరీకి విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యమన్నారు. కర్నూలు విజయ డెయిరీలో 300 కిలోవాట్ల(కే డబ్ల్యూ) సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నెలకొల్పేందుకు ఆయన శుక్రవారం శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ కర్నూలు డెయిరీలో ప్రతి నెల రూ.6 లక్షల విలువ వరకు విద్యుత్ వినియోగిస్తున్నామన్నారు. ఇందులో కనీసం 50 శాతం ఖర్చు తగ్గించుకునేందుకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ప్లాంట్‌ను నెలకొల్పుతున్నామన్నారు. వేసవిలో పాల కొరత ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ఛైర్మన్‌ను కర్నూలు డెయిరీ మేనేజర్, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పరమేశ్వర రెడ్డి, ఓఎస్‌డీ ప్రదీప్‌కుమార్, కర్నూలు డెయిరీ మేనేజర్ ఎన్.విజయకుమార్, డీడీలు రాజేష్, క్వాలిటీ కంట్రోల్ డీజీఎం వెంకటేశ్వర్లు, డీజీఎం ప్లాంట్ విశ్వనాథ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ బలోపేతానికే ధర్మ రక్షానిధి



మహాబలేష్‌కు కండువా వేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ బలోపేతానికే ధర్మ రక్షానిధి సేకరణ జరుగుతుందని వీహెచ్‌పీ రాష్ట్ర సహకోశాధికారి గూడా సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిత చింతక్ కార్యక్రమంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం వచ్చిందన్నారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేసినట్లే ధర్మ రక్షానిధి సేకరణ సైతం ఉత్సాహంగా చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలన్నారు. అనంతరం సాయిబాబా భక్త మండలి కార్యదర్శి మహాబలేష్‌ను వీహెచ్‌పీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. సమావేశంలో భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి, సామాజిక సమరసత కన్వీనర్ క్రిష్టన్న, రాష్ట్ర మాతృశక్తి కన్వీనర్ గౌరి, వీహెచ్‌పీ కార్యదర్శి భానుప్రకాష్, జిల్లా కోశాధికారి శ్రీనివాసరెడ్డి, నగర అధ్యక్షులు మద్దిలేటి పాల్గొన్నారు.

రీసర్వేను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు



హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): రీసర్వేలను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రీసర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ చేయించి మార్కింగ్, చెక్ పాయింట్స్ వేసుకొని పూర్తి చేసుకోవాలన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. మార్చి ఆఖరునాటికి రూఫ్, రూఫ్ కాంక్రీట్ లెవెల్లలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఉగాదిలోపు పూర్తి చేయించాలన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డేలో భాగంగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్ అధికారులు జగనన్న కాలనీలను సందర్శించాలన్నారు. గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌ను విరివిగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన వారందరికీ పనులు కల్పించాలని, బిల్లులను ఎప్పటికప్పుడు జనరేట్ చేయాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణాలకు భూసేకరణ పనులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. రబీ పంటలకు సంబంధించి ఈక్రాప్ బుకింగ్ పూర్తి అయిందని, ఆ వివరాలను రెవెన్యూ రికార్డ్స్‌తో పరిశీలన చేయించాలని తహసీల్దార్లను ఆదేశించారు. హార్టికల్చర్ పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జిల్లాల్లో ఉన్న అమృత్ సరోవర్ ట్యాంకుల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ సీడింగ్‌ను పూర్తి చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్ పై దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ అప్పలకొండ, ఏపీసీ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు చేయండి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు హిమోగ్లోబిన్(హెచ్‌బీ) పరీక్షలు వంద శాతం నిర్వహించేలా పక్కాగా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖాధికారులను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ వైద్య అంశాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఎంజేఏవై కార్డులను త్వరితగతిన జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను ఆదేశించారు. జిల్లాలో 22,097 మంది గర్భిణిలకు గాను 19,151 మందికి హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారన్నారు. ప్రతి ఏఎన్‌ఎం తన పరిధిలో ఉన్న గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించేలా చూడాలని, ఈ మేరకు ఏఎన్‌ఎంలతో సమావేశాలు నిర్వహించి తగిన సూచనలు ఇవ్వాలని డీపీహెచ్‌ఎన్ లిడియాను ఆదేశించారు. సమావేశంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాంజీనాయక్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

27న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు అస్సాం రాష్ట్రం గౌహతిలో సబ్‌జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నట్లు హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కృష్ణా జిల్లా గన్నవరంలో నిర్వహించిన సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరచిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ జట్టు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

క్రీడాకారులకు అభినందన..

గత నెల 24 నుంచి 27వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలో రాజ్యపాళ్యం జిల్లాలో నిర్వహించిన జాతీయస్థాయి శిలబం క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను డాక్టర్ శంకర్ శర్మ శుక్రవారం అభినందించారు. సత్యనారాయణ, మనోజ్ఞ, గీతాంజలి వెండి పతకం సాధించినట్లు శిలబం శిక్షకులు రాఘవేంద్ర తెలిపారు.

8న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో ఈ నెల 8న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హజరత్ సయ్యద్ మహ్మద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా నిర్వహించే పోటీలలో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440984959ను సంప్రదించాలన్నారు.

రికార్డులను అప్పగించండి

కల్లూరు: మూడేళ్లుగా మూత పడిన ప్రైవేటు–అన్ఎయిడెడ్ పాఠశాలల రికార్డులు ఈ నెల 6వ తేదీలోగా అందజేయలని ఎంఈఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్లూరులోని మదర్ థెరిస్సా విద్యానికేతన్, శాంతి విద్యామందిర్, పద్మశ్రీ విద్యానికేతన్, వీకేఎంఎస్ లీడర్స్ ప్రైమరీ, వెంకటేశ్వర నగర్‌లోని ఈశ్వర్ ఇంగ్లీష్ మీడియం, గోవర్ధన్‌నగర్‌లోని శ్రీగాయత్రి, ఉలిందకొండలోని ఎస్‌వీ యూపీ, పెద్దటేకూరులోని మణిసాయి కాన్సెప్ట్ యూపీ పాఠశాలలు రికార్డులను అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మృతి



మృతిచెందిన లక్ష్మయ్య ఆచారి

కర్నూలు: కల్లూరులోని శివప్ప నగర్‌లో నివాసముంటున్న లక్ష్మయ్య ఆచారి (48) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నందికొట్కూరు మండలం బొల్లవరం స్వగ్రామం. గురువారం సాయంత్రం స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వస్తుండగా వార్తా ఆఫీస్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న నందికొట్కూరు డిపో బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక రాత్రి మృతిచెందాడు. శుక్రవారం ఉదయం తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముందు ఆటో మాయం

కర్నూలు బి.క్యాంప్‌లో నివాసముంటున్న లింగన్న ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన ఆటో మాయమైంది. ఈనెల 1వ తేదీ పగులంతా ఆటో నడిపి, రాత్రి ఇంటికి చేరుకుని ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి ఆటో కనిపించలేదు. దీంతో శుక్రవారం ఆయన మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైమ్ కార్నర్

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

కర్నూలు(లీగల్): చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. కర్నూలుకు చెందిన జి.మోహన్ రావు నుంచి 2016 నవంబర్ 10న అవసరం కోసం సజ్జద్ హుసేన్ రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించేందుకు వడ్డీతో కలిపి 2017 జనవరి 10న రూ.2.12 లక్షలకు చెక్కు ఇచ్చాడు. చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో మోహన్‌రావు కోర్టులో కేసు దాఖలు చేశాడు. విచారణ తర్వాత నేరం రుజువు కావడంతో సజ్జద్ హుసేన్‌కు జైలు శిక్షతో పాటు చెక్కు మొత్తం చెల్లించాలని కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.షర్మిల తీర్పు చెప్పారు.

ఆర్‌ఐపై దాడికి యత్నం

కర్నూలు (టౌన్): విధుల్లో ఉన్న ఓ ఉద్యోగిపై ఓ వ్యక్తి దాడికి యత్నించాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మార్చి నెల కావడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వాజిద్ పన్ను వసూలు నిమిత్తం శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని కృష్ణానగర్‌కు వెళ్లారు. రూ.2 లక్షలు బకాయి ఉన్న ఇంటి వద్ద కుళాయి కనెక్షన్ తొలగించే ప్రయత్నం చేయగా యజమాని వాగ్వాదానికి దిగాడు. ఒక దశలో దాడికి యత్నించగా స్థానికులు సర్దిచెప్పడంతో గొడవ కాస్తా సద్దుమణిగింది.

విద్యార్థి ఆచూకీ లభ్యం



తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న ఎస్‌ఐ సోమ్లానాయక్

గూడూరు రూరల్: కె.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని పర్ల బాలుర వసతి గృహం పదో తరగతి విద్యార్థి బైరపోగు జాషువా ఆచూకీ శుక్రవారం లభ్యమైంది. ఎస్‌ఐ సోమ్లానాయక్ విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. గత నెల 24న హాస్టల్ నుంచి విద్యార్థి జాషువా వెళ్లిపోయాడు. దీంతో వార్డెన్ శ్యామసుందరరావు మునగాలలోని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బంధువులు, తెలిసిన వారిని విచారించినా విద్యార్థి ఆచూకీ లేకపోవడతో గత నెల 26న కె.నాగలాపురం పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టగా బంధువుల ఇంట్లో ఉన్నాడని తెలుసుకుని పోలీసుస్టేషన్‌కు తీసుకునివచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
కర్నూలు
శనివారం ॥ 4-3-2023


● కె. రామలక్ష్మి

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకుగాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవనజ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం


● కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజీ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం. వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి

కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. పెళ్లి ప్రేమను చంపేస్తుంది అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, చొరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ




● విజేత కుమార్

ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లాజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన

> 'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



- మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి.
- ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్రపోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి.
- మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి.
- మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి.
- హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

సహజమైన రూమ్ ఫ్రెషనర్

- అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.
- దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!
- సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.


● పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

**మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్ ప్లాంట్, కప్పురిల్ల...
ఔషధమొక్కల లిస్ట్ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.**

''ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

> ### ఎనిమిదిళ్లు మారాను!
>
> 
>
> మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.
>
> – గుడి మంజుల, మొక్కల ప్రేమికురాలు

సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి